సాక్షి ఒడిశా

శనివారం, 16, మార్చి, 2024

7



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,06,984
బంగారం	280 మిల్లీ గ్రాములు
వెండి	84 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి -8లో

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ విష్ణుపాత్రో సూచించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
శని	ఆది
6.02	4.40

న్యూస్‌రీల్

పాండ్యన్‌కు కృతజ్ఞతలు



పాండ్యన్‌కు మజ్జిగౌరి చిత్రపటం అందజేస్తున్న నెక్కంటి

రాయగడ: రాష్ట్ర 5టీ అధ్యక్షుడు వీకే పాండ్యన్‌కు జిల్లాలోని చందిలి పంచాయతీ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరావు నేతృత్వంలోని పంచాయతీకి చెందిన సుమారు 200 మంది ప్రజలు రాజధాని భువనేశ్వర్ శుక్రవారం చేరుకుని పాండ్యన్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. పంచాయతీగా ఉన్న చందిలిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఏసీగా గుర్తించినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కింగ్ కోబ్రా కలకలం



పట్టుబడిన కింగ్ కోబ్రా

బరంపురం: జిల్లాలోని దిగపండి దగ్గర పెందురబడి గ్రామాల్లోకి 12 అడుగుల కింగ్ కోబ్రా చొరబడి కలకలం సృష్టించింది. స్థానికుల సమాచారంతో దిగపండి అటవీ రేంజ్ అధికార బృందం సహకారంతో స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకి చెందిన ఆశిరాజ్ చాకచక్యంతో కోబ్రాను పట్టుకున్నారు. అనంతరం దిగపండి అటవీ విభాగం దగ్గరలో ఉన్న చందుడిదేవ్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కరుడుగట్టిన నేరస్తుడు అరెస్టు



అరెస్టైన భగవాన్‌రెడ్డి

బరంపురం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన మూడు దోపిడీ ఘటనలకు సంబంధించి కరుడుగట్టిన నేరస్తుడు ఎ.భగవాన్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధి హరడాఖండి, మార్తవీధి కాశీ విశ్వనాథ్ ఆలయం దగ్గర కత్తులతో స్థానికులపై దాడి చేసి, ఇద్దరిని గాయపరిచిన ఎ.భగవాన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. అతడు మరో రెండు ఘటనల్లో నిందితుడిగా ఉన్నారు. ఆయన వద్ద నుంచి రెండు కత్తులు సీజ్ చేశారు.

గ్యాస్ సిలెండర్‌కు మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొరాపుట్: జిల్లాలోని లక్ష్మీపూర్ సమితి కేంద్రంలో ఒక హోటల్‌లో గ్యాస్ సిలెండర్‌కు శుక్రవారం మంటలు అంటుకున్నాయి. దీంతో భయభ్రాంతులకు గురైన ప్రజలు బయటకు పరుగులు పెట్టారు. మంటలు పెరగడంతో ఆ ప్రాంతంలో దుకాణదారులు, స్థానికులు వెంటనే ఖాళీ చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. దుకాణం లోపల సిలెండర్ మంట అదుపు చేయడానికి ప్రయత్నం చేసి విఫలమయ్యారు. వెంటనే సిలెండర్‌ను రోడ్డు మీదకు తీసుకొచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టో విడుదల

- రైతులకు రుణమాఫీ
- డ్వాక్రా రుణాలు మాఫీ ప్రకటన
- యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని వెల్లడి



మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ఒక్కరోజు ముందు రాష్ట్ర కాంగ్రెస్ శుక్రవారం తన ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసింది. దీనిలో భాగంగా 90 వాగ్దానాలు, 9 హామీలు ఇచ్చింది. రాష్ట్రంలో 24 ఏళ్ల సుదీర్ఘ బీజేడీ పాలనలో సాధ్యం కాని వాటిని కాంగ్రెసు అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పటా్నయక్, ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి అజోయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9 హామీలు

వరి క్వింటాల్‌కు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) రూ.3 వేలతో పాటు బోనస్, వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని, నెలకు రూ.2 వేల పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అంతేకాకుండా అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామని పేర్కొంది. దాదాపు 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు, 3 ఏళ్లపాటు నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతి అందజేయడం హామీగా ప్రకటించింది. గృహ లక్ష్మీ యోజన అమలు చేయనున్నట్లు పేర్కొంది. ఈ యోజన కింద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు కుటుంబ పెద్దలకు (మహిళలు) హామీ పూర్వక నెలవారీ రూ.2,000 భృతిని ప్రకటించింది. ప్రతీ కుటుంబానికి రూ.500కే వంట గ్యాస్ (ఎల్‌పీజీ) సిలెండర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.15 లక్షల వరకు ఉచిత ఆరోగ్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చింది. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాల రుణమాఫీ చేయనున్నట్లు తెలియజేసింది. విద్యాసంస్థలు, ఉద్యోగ రంగంలో వెనుకబడిన తరగతులకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపింది. పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టి పేదలకు 35 కిలోల బియ్యం, 1 కిలో ఉప్పు, 1 లీటరు వంట నూనె, 1 కిలో పప్పులు, 250 గ్రాముల పసుపు అందిస్తామని ప్రకటించింది.

కొనసాగుతున్న నిరసనలు



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



బీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితిలో ప్రజలు కొద్ది రోజులుగా చేపడుతున్న నిరసన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని ప్రాంతాలను ఎన్ఏసీలుగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే అత్యధిక శాతం జనాభా కలిగిన కాసీపూర్ సమితిని సబ్ డివిజన్‌గా, అదేవిధంగా సమితి పరిధిలోని డొంగాశిలి పంచాయతీని సమితిగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు రాష్ట్రపతి పేరిట ఒక వినతిపత్రంను సమితి బీడీవో మానసి దాస్‌కు సమర్పించారు. సమితి ప్రజలంతా డొంగాశిలిలో గురువారం సమావేశమై ఆదివాసీ సమాజ్ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సభలో ఆదివాసీ సమాజ్ నాయకుడు సుభాష్ జొడియా మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంగా శరవేగంతో అభివృద్ధి చెందుతున్న కాసీపూర్‌లో పదేళ్లుగా జనాభా పెరిగిందన్నారు. అయితే అందుకు తగ్గ సౌకర్యాలు ప్రభుత్వం కల్పించకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ డివిజన్‌గా గుర్తించినట్లయితే సమితి అభివృద్ధితో పాటు ప్రజలు ఆర్థిక, సామాజిక రంగాల్లో పురోగతి సాధిస్తారని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న శివ కుమార్ పటా్నయక్, వేదికపై బసంత ఉలక, పండలు

రాయగడ: పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి బీజేపీ పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పటా్నయక్ అన్నారు. స్థానిక సిరిగుడ గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో పాత్రికేయుల సమస్యలు అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. నిరంతరం సమాజ సేవలో అంకితభావంతో పనిచేస్తూ, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వం ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాల్లో పాత్రికేయులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ, మన రాష్ట్రంలో అటువంటి దాఖలాలు లేవని ఆరోపించారు. ముఖ్యంగా పాత్రికేయులు వార్తలు సంగ్రహించే విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రతినిధులకు పారితోషికం పేరుతో జీతాలను పెంచుతున్నట్లు ప్రకటించిందన్నారు. అందుకు సంతోషిస్తున్నప్పటికీ అదే తరహా ప్రజాభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్న పాత్రికేయులకు సైతం నెలవారీ వేతనం సమకూర్చాలన్నారు. అలాగే కేంద్ర మంత్రిత్వ శాఖతో తాను స్వయంగా చర్చించి పాత్రికేయులకు రైల్వే పాస్‌లను అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యులు బసంత కుమార్ ఉలక, ఆ పార్టీ జిల్లా సాధారణ కార్యదర్శి కిషోర్ పండ తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన భల్లూకం



ఎలుగుబంటిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం



పట్టుబడిన ఎలుగుబంటి

కొరాపుట్: ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న భల్లూకాన్ని అటవీ శాఖ అధికారులు చాకచక్యంగా బంధించారు. నబరంగ్‌పూర్ జిల్లా కొడింగా సమీపంలో ఉన్నటువంటి ముఖ్యపలి గ్రామ సమీప అటవీ ప్రాంతంలో పట్టుబడింది. గత మూడు నెలలుగా ఈ భల్లూకం ఆహారం కోసం గ్రామాల్లో యథేచ్ఛగా సంచరిస్తోంది. దీనికి భయపడి ప్రజలు వ్యవసాయ పనులు, అటవీ ఉత్పత్తుల సేకరణకి వెళ్లడం లేదు. రాత్రిపూట ఇంటి నుంచి బయటకు రావడం లేదు. ఆ ఎలుగుబంటి అడవిలో నిర్మానుష్యంగా ఉండే ఒక షెడ్‌లో ఉంటుందని గిరిజనులు గుర్తించారు. దీంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఆ షెడ్‌ని నలువైపులా మూసివేసి ఒక రంధ్రం ఏర్పాటు చేశారు. రంధ్రానికి అనుసంధానిస్తూ బోను అమర్చారు. దాంతో బల్లూకం బోనులోకి దూరి పట్టుబడింది. అనంతరం దానికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. త్వరలో భల్లూకం ఆరోగ్య పరిస్థితి అనుకూలంగా ఉంటే వేరే అటవీ ప్రాంతంలో విడిచి పెడతామని అధికారులు ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో ఆచార్యకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న ప్రసన్న ఆచార్య

భువనేశ్వర్: బీజేడీ సీనియర్ నేత ప్రసన్న ఆచార్య గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో రైరాఖోల్‌కు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న బెల్‌డిహి సమీపంలో అతని కారు గ్యాస్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ దుర్ఘటనలో ఆయన తీవ్ర గాయాలపాలయ్యారు. సీఎం నవీన్ నివాస్‌లో జరిగిన పార్టీ సమావేశంలో పాల్గొని, భువనేశ్వర్ నుంచి బర్‌గఢ్‌కు వెళ్తుండగా 55వ నంబర్ జాతీయ రహదారి సంబల్‌పూర్ - రైరాఖోల్ మార్గంలో ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన ప్రసన్న ఆచార్యని తొలుత రెరాఖోల్ సబ్ డివిజనల్ ఆస్పత్రి తరలించి ప్రథమ చికిత్స చేశారు. ఆ తర్వాత సంబల్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతడి నుదుటి, ముక్కుపై 35 కుట్లు పడ్డాయి. అతను స్పృహలో ఉన్నారు. ఐసీయూలో పరిశీలనలో ఉంచినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. సిటి స్కాన్‌లో అంతర్గత గాయాలు ఏవీ లేవని తేలిందని వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రసన్న ఆచార్య వ్యక్తిగత భద్రతా అధికారి (పీఎస్‌ఓ)కి కూడా పక్కటెముకలు విరిగాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రసన్న ఆచార్య రాబోయే ఎన్నికల్లో రెరాఖోల్ అసెంబ్లీ స్థానం నుంచి బిజూ జనతా దళ్ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు పోటీపడుతున్న వారిలో ముందంజలో ఉన్నారు. ప్రసన్న ఆచార్య ప్రమాదానికి గురైన వార్తతో ముఖ్యమంత్రి నవీన్ పటా్నయక్ దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆచార్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అంబులెన్స్ సిబ్బంది నిర్వాకం

- గర్భిణిని ఆటోలో తరలింపు



ఆటోలో గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రాయగడ: అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీ మహిళలకు సకాలంలో చికిత్స అందజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ సేవలు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల బాధితులు సకాలంలో పొందలేకపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని పద్మపూర్ సమితి లికిటిపాదొరా పంచాయతీలోని సరిగుడ గ్రామానికి చెందిన ఒక గర్భిణికి బుధవారం పురుటి నొప్పులు వచ్చాయి. దీంతో 108 అంబులెన్స్‌కు ఫోన్‌లో సమాచారం అందజేశారు. అయితే సిబ్బంది నిర్లక్ష్యం వలన సకాలంలో అంబులెన్స్ గ్రామానికి చేరుకోలేదు. దీంతో చేసేదేమీలేక సమయం మించిపోతుండడంతో గర్భిణిని ఆటోలో పద్మపూర్ పీహెచ్‌సీకి తరలించారు. అదృష్టవశాత్తు ఆమె పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అయితే అంబులెన్స్ సిబ్బంది నిర్వాకంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు



శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విక్రమదేవ్ వర్సిటీలో ఎన్నికల పోలింగ్, ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. మొత్తం 300 మందికి శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమాల్లో జిల్లా మాస్టర్ ట్రైనీ, జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్రో, జయపురం మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పటా్నయక్, జయపురం నిర్వాచన మండలి అధికారిగా బీఈవో చందన కుమార్ నాయక్, ఏబీడీవో మనోజ్ కుమార్ నాయక్, ఐటీడీఏ ఇంజినీర్ దిలీప్ కుమార్ గిరి, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ అశోక్ కుమార్ బెహర, గ్రామీణ అభివృద్ధి సంస్థ ఇంజినీర్ దేబాశిశ్ నాయక్, జయపురం అదనపు తహసీల్దార్ మనో రంజన్ సునా తదితరులు పాల్గొన్నారు.

బాంబుతో దుండగుల దాడి



చికిత్స పొందుతున్న టుకునా బూంయ్య



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బరంపురం: నగర శివారులోని రఘుపతి నగర్‌లో నివాసముంటూ, దిగపండి బ్లాక్‌లో సీఆర్‌సీగా విధులు నిర్వహిస్తున్న టుకునా బూంయ్య ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బాంబుదాడి చేసిన ఘటన స్థానికంగా సంచలనం రేపింది. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనలో టుకునా బూంయ్యకి తీవ్రగాయలు కావడంతో స్థానిక ఎంకేసీజీ మెడికల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్పీ సార్వణ్ వివేక్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఇద్దరు మావోయిస్టులు లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులు

మల్కన్‌గిరి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో సౌత్, వెస్ట్ డివిజన్ డీఐజీ చరయ్ సింగ్ మీన, మల్కన్‌గిరి ఎస్పీ నితీష్ వాద్వానీ ఎదుట ఇద్దరు మావోయిస్టులు శుక్రవారం లొంగిపోయారు. కడ్తీ హుంరా, గంగా కర్జామి అనే మావోయిస్టులు ఇదివరకు చిత్రకొండ ఏరియాలో పనిచేసేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం దళంలోని అగ్రనేతలు చిన్నచూపు చూస్తున్నారని, అందువలన జన జీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఎస్పీ నితీష్ వాద్వానీ మాట్లాడుతూ.. లొంగిపోయిన మావోలకు ప్రభుత్వం అందజేస్తున్న అన్ని పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అలాగే వారికి ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు.

‘బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి’



కొమ్మపల్లి జంక్షన్ నుంచి ర్యాలీగా వస్తున్న దృశ్యం



ఆర్‌డీసీ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న బాలకృష్ణ

బరంపురం: పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని జిల్లా వామపక్ష అధ్యక్షుడు బాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌డీసీ కార్యాలయం వద్ద ఆల్ ఇండియా కృషక్‌మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలతో అన్నదాతను ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. పదేళ్ల బీజేడీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకాయని పేర్కొన్నారు. పెరిగిన అన్ని ధరలు తగ్గించాలని, కార్మికుల కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను ప్రవేటీకరించడం సరికాదన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిని రద్దుచేసి, పనికి తగ్గ జీతాలు చెల్లించాలని, పదవీ విరమణ చేసిన వారికి పాత పద్ధతిలో పింఛన్ అందజేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశ, ఏఎస్‌జీ మహిళా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగస్తులుగా గుర్తించాలన్నారు. అదేవిధంగా కార్మికులకు బీమా, ఉచిత ఆరోగ్య సేవలు అందించాలని కోరారు. తమ ప్రతిపాదనలు అమలు చేయకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డీసీకి వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, డీయూసీ తదితరుల ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐఐసీగా నీలకంఠబెహార



నీలకంఠ బెహార

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ పోలీసుస్టేషన్ ఐఐసీగా నీలకంఠ బెహర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఆయన జిల్లాలోని చంద్రపూర్‌లో ఐఐసీగా విధులు నిర్వహిస్తుండేవారు. కల్యాణ సింగుపూర్ ఐఐసీగా వ్యవహరించే సుమంతి మహంతి రాయగడకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో బెహర బాధ్యతలు చేపట్టారు. శాంతి భద్రతలు పరిరక్షించేందుకు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి తన కర్తవ్యాన్ని నిర్వహిస్తానని పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



తపస్విని కొహార్

జయపురం: బొరిగుమ్మ సబ్ డివిజన్ పోలీసు అధికారిగా తపస్విని కొహార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు బొరిగుమ్మ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బిజయ నారాయణ సాహు నేతృత్వంలో జర్నలిస్టులు స్వాగతం పలికారు. దొంగతనాలు, దారి దోపిడీలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు కె.సికిల్ దొర, సుశీల్ కుమార్ షాడంగి, రంజన్ మిశ్ర, మోహన్ దొర, టింకు పట్నాయిక్, సుకాంత మరిఖ తదితరులు పాల్గొన్నారు.

గుణుపూర్ సీపీఐ అభ్యర్థిగా సాబరొ



అనాసన్ సాబొరొ

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ తమ పార్టీ తరుపున పోటీచేసే అభ్యర్థుల పేర్లను ఖరారు చేస్తోంది. తాజాగా జిల్లాలోని గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేస్తూ ఒక ప్రకటనను విడుదల చేసింది. అనాసన సాబొరొను ఎమ్మెల్యే అభ్యర్థిగా పేర్కొంటూ ఆ పార్టీ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి జుధిష్టర్ మహాపాత్రో శుక్రవారం తెలియజేశారు. త్వరలో మరికొన్ని స్థానాలకు సంబంధించి అభ్యర్థుల పేర్లను ఖరారు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారుడికి అభినందన



రెజ్లింగ్ క్రీడాకారుడు శివచరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీని వాసరావు, ఇతర అధ్యాపకులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ సీఎస్‌ఈ ద్వితీయ ఏడాది చదువుతున్న ఎండ శివచరణ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించటంతో ఈ అవకాశం లభించింది. అండర్ -20 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు ఈ నెల 20వ తేదీ నుంచి చిత్తూరులో జరగనున్నాయి. ఈ క్రీడాకారుడిని శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాస రావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ చంద్రశేఖర్‌తో కూడిన అధ్యాపకులు, మేనేజ్‌మెంట్ సభ్యులు అభినందించారు.

తేనేటీగల దాడిలో వ్యక్తికి గాయాలు

సారవకోట: మండలంలోని బురుజువాడ గ్రామంలో శుక్రవారం తేనెటీగల దాడిలో జగన్నాథపురం గ్రామానికి చెందిన పెద్దింటి ఆది నారాయణ గాయాలపాలయ్యాడు. బురుజువాడ గ్రామంలోని తేనె పట్టు తీసేందుకు చెట్టు ఎక్కగా అక్కడున్న తేనెటీగలు దాడి చేసి గాయపర్చాయి. మంటతో ఉన్న కర్రను పట్టుకుని చెట్టు ఎక్కి తేనె పట్టు తొలగించేందుకు ప్రయత్నించే సమయంలో మంటతో ఉన్న కర్ర పక్కనున్న గడ్డి, ఆకులపై పడటంతో మంటలు రేగి పలు చెట్లు కాలిపోయాయి. వెంటనే స్థానికులు స్పందించి మంటలను అదుపు చేశారు.

పాసింగ్ అవుట్ పరేడ్



ఐఎన్ఎస్ చిలికా అగ్నివీరుల పాస్ అవుట్ పరేడ్

భువనేశ్వర్: సదరన్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో భారత నావికా దళానికి చెందిన 2,630 మంది అగ్నివీరులు ఐఎన్ఎస్ చిలికా నుంచి ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 396 మంది మహిళలు ఉన్నారు. సదరన్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ వి.శ్రీనివాస్ సమక్షంలో నేవల్ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరి కుమార్ పరేడ్‌ను సమీక్షించారు. ఈ పాసింగ్ అవుట్ పరేడ్ 16 వారాల కఠినమైన నావికాదళ శిక్షణ విజయవంతమైన ముగింపుగా మాత్రమే కాకుండా, భారత నావికా దళంలో శిక్షణ పొందిన వారి కోసం కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టిందని ప్రోత్సహించారు. అడ్మిరల్ కుమార్ తన ప్రసంగంలో, శిక్షణార్థులు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని జ్ఞాన సముపార్జన పునాదిని మరింత బలపరచుకోవాలని పిలుపునిచ్చారు. నేర్చుకోవాలనే సంకల్పం మరియు ముందుకు సాగే వారి కెరీర్‌లలో రాణించడానికి నిబద్ధతతో ఉండాలని తెలిపారు. దేశ నిర్మాణ సాధనలో భారత నౌకాదళం యొక్క ప్రధాన విలువలైన విధి, గౌరవం మరియు ధైర్యాన్ని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన అగ్ని వీరులకు పతకాలు, ట్రోఫీలను ప్రదానం చేశారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని అంగద్ డివిజన్‌కు, రన్నర్స్ ట్రోఫీని శివాజీ డివిజన్‌కు అందజేశారు. ఐఎన్ఎస్ చిలికా ద్విభాషా ట్రైనీల మ్యాగజైన్ అంకుర్ వేసవి సంచికను ఆయన ఆవిష్కరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రసంగిస్తున్న విష్ణుపాత్రో, పక్కనే సింహాచల్ మహాపాత్రో తదితరులు

- ఏఎస్పీ విష్ణుపాత్రో

రాయగడ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్పీ విష్ణుపాత్రో సూచించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సామాజిక సురక్ష శాఖ ఆధ్వర్యంలో నిషా విముక్తి భారత్ అభిజాన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత మత్తుకు బానిస కాకుండా సామాజిక మాధ్యమాలు, పత్రికలు తదితర ద్వారా వివరించాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌సీసీ, స్కాట్ వంటి క్యాడెట్లతో చైతన్య కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సామాజిక సురక్షా శాఖ అధికారి సింహాచల్ మహాపాత్రో, విద్యావేత్త డాక్టర్ డీకే మహంతి తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పర్లాకిమిడి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి న్యాయవాదుల సంఘం సభ్యులు, స్థానికులు కలిసి తాళం వేసి శుక్రవారం తమ నిరసన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ శాఖ అధికారి ల్యాండ్ వాల్యుయేషన్‌ను ప్రతీనెలా ఇష్టానుసారంగా పెంచేసి 10 శాతం స్టాంప్ డ్యూటీ విధిస్తున్నారని ఆరోపించారు. దీనిని వ్యతిరేకిస్తూ అనేకమంది రైటర్స్, న్యాయవాదులు, రియల్ ఎస్టేట్, బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తం కావడంతో పోలీసులు చొరవ తీసుకుని ఆందోళనకారులను నచ్చజెప్పారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సిద్ధేశ్ మిశ్రా ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది.

ఇద్దరు గంజాయి స్మగ్లర్లు అరెస్ట్

ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం అక్రమంగా తరలిస్తున్న 30 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగించిన కారును, రూ.1.50 లక్షలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జి.మాడుగుల సీఐ రమేష్ వివరాల ప్రకారం.. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం రావడంతో ఏవోబీ సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు జంక్షన్ వద్ద మధ్యాహ్నం పోలీసులు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి ఆంధ్ర వైపు వస్తున్న కారు వారిని చూసి నిలుపుద చేసి ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా పట్టుకున్నారు. కారును తనిఖీ చేయగా రెండు బ్యాగుల్లో గంజాయిని గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి, గంజాయిని, కారును సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన వారిలో ముంచంగిపుట్టు మండలం పనసపుట్టు పంచాయతీ గిద్దులపుట్టు గ్రామానికి చెందిన జనం కృష్ణ, ఒడిశా రాష్ట్రం చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు పంచాయతీ సింగోయి గ్రామానికి చెందిన రూబెన్ ఖరాలుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు ఎస్ఐ రవీంద్ర, ఏఎస్ఐ లక్ష్మయ్య, పోలీసులు, హోంగార్డులు సతీష్, కె.ఆర్.కె పడాల్ పాల్గొన్నారు.



పట్టుకున్న గంజాయి, నిందితులతో సీఐ రమేష్, ఎస్ఐ రవీంద్ర, పోలీసులు

• బంద్ ప్రశాంతం



రోడ్డుపై కూర్చొని ఆందోళన తెలుపుతున్న ప్రజలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన సమితిని ఎస్‌ఏసీగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. దీంతో బరంపురం, పర్లాకిమిడి, మోహన, అడవ వంటి ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని 57 ఎన్ఏసీలు, మరో ఐదు మున్సిపాలిటీలుగా ప్రకటించిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో మోహన సమితిని సైతం ఎన్ఏసీగా గుర్తించాలని మోహన అభివృద్ధి పరిషత్ అధ్యక్షుడు దండాసి సాహు నేతృత్వంలో ఈ బంద్ పాటించారు. కళాశాలలు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి తమ మద్దతు తెలియజేశాయి. పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆందోళనకు న్యాయవాది బిభుచరణ్ మల్లిక్, ప్రఫుల్ల లిమ్మ, సుగ్యని సాగర్ తదితరులు మద్దతు ప్రకటించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు యువకుడు మృతి


ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ పాతపొన్నాడ గ్రామంలో జరిగిన విద్యు త్ షార్టు సర్క్యూట్ ప్రమాదంలో గంగు శంకరరావు (29) మృతి చెందాడు. తాను నిర్వహిస్తున్న ఇటుక బట్టీల వద్ద మోటార్ పాడవ్వటంతో మరమ్మతులు చేస్తుండగా, షార్ట్ సర్క్యూట్ అయ్యి షాక్ కొట్టడంతో ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ఆస్పత్రికి తీసుకు వెళ్లే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. శంకరరావు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ స్థానిక స్మార్ట్ కెం పరిశ్రమలో వర్కర్‌గా చేస్తున్నారు. ఇదే పంచాయతీ బింగిపేట గ్రామానికి చెందిన పల్లవితో ఏడాది కిందట వివా హం జరిగింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జీవనాధారం కోల్పోయిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్టు



పట్టుబడిన సెల్‌ఫోన్ల దొంగలు

కొరాపుట్: సెల్‌ఫోన్లు దొంగతనం చేస్తున్న ముఠాను నబరంగ్‌పూర్ పోలీసులు అరెస్టు చేశారు. నబరంగ్‌పూర్ ఐఐసీ సంబిత్ పాత్రో ఈ కేసు వివరాలను శుక్రవారం ప్రకటించారు. వివిధ ప్రాంతాల్లో వరుసగా ఫోన్‌లు చోరీ అవుతున్న ఫిర్యాదులు పెరగడంతో జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ ఒక ప్రత్యేక పోలీస్ బృందం ఏర్పాటు చేశారు. పోయిన ఫోన్లలో ఈఎంఐ నంబర్ ఆధారంగా నూతన సిమ్‌లు వినియోగిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి జైలుకి తరలించారు.



స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

తెలుసుకుందాం..
తెలివిగా నడుచుకుందాం

- 18 నుంచి 30 వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం
- 145 కేంద్రాల్లో పరీక్ష రాయనున్న 30,574 మంది విద్యార్థులు
- విద్యార్థుల్లో సందేహాల నివృత్తికి చర్యలు



టెన్త్‌పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయం ఆసన్నమైంది. 18 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు అధికారులు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. టెన్త్ విద్యార్థులు తొలిసారిగా పబ్లిక్ పరీక్షలను రాయబోతున్నారు. వారు చదువుతున్న పాఠశాలలో కాకుండా, కాస్త దూరంగా కొత్తగా కేటాయించిన పరీక్ష కేంద్రానికి వెళ్లి, పరీక్ష రాయాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థుల్లో ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల విద్య ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలతో కూడిన నియమావళిని హాల్‌టిక్కెట్లపై ముద్రించింది. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న టెన్త్‌క్లాస్ పరీక్షలకు పునర్విభజన శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా హాజరు కానున్న 30574 మంది విద్యార్థుల కోసం 145 కేంద్రాలను సిద్ధం చేశారు. హాల్ టికెట్లను ప్రభుత్వం ఇప్పటికే వెబ్‌సైట్‌లో సిద్ధంగా ఉంచింది. వీటిని అందుకున్న విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలను తమ తల్లిదండ్రులతోపాటు ఒకసారి సందర్శించడం ఉత్తమమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఈ సూచనలు పాటించండి

- మొత్తం ఏడు రోజులపాటు జరిగే ఈ పరీక్షలకు ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకల్లా కచ్చితంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.
- ప్రతిరోజు ఉదయం 8.45 నుంచి 9.30 వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9.30కు గేట్లు మూసి వేసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- తమ హాల్ టికెట్లు పొందిన విద్యార్థులు దానిపై ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏమైనా తప్పులు ఉంటే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం దృష్టికి తీసుకెళ్లి, సరి చేయించుకోవాలి.



- ప్రశ్న పత్రాలపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రిస్తారు. హాల్ టిక్కెట్స్‌పై ఉన్న ఎన్‌రోల్‌మెంట్ నంబరు ఆధారంగా.. వారికి కేటాయించిన రూములవారీగా విద్యార్థులను కూర్చోబెడతారు. బార్ కోడింగ్ విధానంలో రూపొందించిన ఓఎంఆర్ షీట్లను విద్యార్థుల రోల్ నంబరు ఆధారంగా ఇన్విజిలేటర్ పంపిణీ చేస్తారు.
- విద్యార్థి రోల్ నంబరు ఆధారంగా ఆ విద్యార్థి తనకు కేటాయించిన సీట్‌లో కూర్చున్న తర్వాత ఇన్విజిలేటర్ వచ్చి బార్ కోడింగ్‌తో కూడిన ఓఎంఆర్ షీట్, ప్రశ్న పత్రం, ఆన్సర్ బుక్‌లెట్ అందజేస్తారు. తదుపరి ఓఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా పూరించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయరాదు.
- పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన తర్వాత, మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసేవరకు విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. గుర్తింపు కార్డు కలిగి, పరీక్షల విధుల్లో ఉన్న రాష్ట్ర పరిశీలకులు, జిల్లా అధికారులు, స్క్వాడ్ బృందాల వారు పరీక్ష కేంద్రాల్లోకి ఆకస్మిక తనిఖీలకు వస్తుంటారు.

వదంతులు నమ్మవద్దు..

- టెన్త్ ప్రశ్న పత్రం లీకేజీ అయ్యిందని, పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిందని కొందరు పనిగట్టుకుని చేసే ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మ కూడదు. విద్యార్థులు పరీక్షలకు ప్రశాంతంగా హాజరుకావాలి. ఒక వేళ ఏదైనా సెంటర్ నుంచి ప్రశ్న పత్రం లీకేజీకి గురైతే.. అది ఎక్కడ జరిగిందో గుర్తించే సాంకేతిక విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- ప్రశ్న పత్రంపై మొదటిసారి బార్‌కోడ్, స్కానర్ క్యూఆర్ కోడ్‌తో ప్రింట్ చేస్తున్నారు. ఒకవేళ సెల్‌ఫోన్‌లో ఫొటో తీస్తే పరీక్షల విభాగం సాంకేతిక విభాగానికి వెంటనే తెలిసిపోతుంది.
- పరీక్ష కేంద్రంలో పక్క, పక్కన కూర్చునే ఏ ఇద్దరు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్న పత్రంలో ప్రశ్నలు ఒకే వరుస క్రమంలో ఉండవు. విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయాలనే ఆలోచన వీడాలి. కాపీయింగ్‌కు పాల్పడినా, జేబుల్లో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా, పరీక్ష కేంద్రంలో పోలీసులు, పాఠశాల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపిస్తారు. పరీక్ష రాసే సమయంలో ఏ విద్యార్థి వద్ద అయినా స్లిప్పులు కనిపిస్తే పరీక్షల నుంచి డీబార్ చేస్తారు.
- తాజా నిబంధనల ప్రకారం ఇన్విజిలేటర్లతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డీఓల వద్ద సైతం సెల్‌ఫోన్లు ఉండేందుకు అనుమతి లేదు. నో సెల్‌ఫోన్ జోన్‌లగా పరీక్ష కేంద్రాలను ప్రకటించారు.

‘హక్కులపై అవగాహన అవసరం’



వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి చిరంజీవి

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినియోగదారుల చట్టంపై అవగాహన ఉంటే స్వచ్ఛమైన ఆర్థిక సమాజం సాధ్యమవుతుందని వినియోగదారుల వ్యవహారాల కమిషన్ న్యాయమూర్తి రఘుపాత్రుని చిరంజీవి అన్నారు. పౌర సరఫరాలు, సంబంధిత శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధ్యక్షత వహించారు. వినియోగదారుల వ్యవహారాల కమిషన్ న్యాయమూర్తి రఘుపాత్రుని చిరంజీవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ పౌరులు తమ హక్కులు కోల్పోరాదని చెప్పారు. కృత్రిమ మేధస్సుపైనా అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సమాఖ్య అధ్యక్షుడు న్యాయవాది బగాది రామ్మోహన్ రావు, జిల్లా సరఫరాల అధికారి శాంతిశ్రీ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాస రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, సెట్ శ్రీ ముఖ్యకార్య నిర్వహణాధికారి బీవీ ప్రసాదరావు, ఇతర శాఖల అధికారులు, ఫోరం సభ్యులు రాధా రాణి, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ‘కె.మత్స్యలేశం ప్రభుత్వ పాఠశాల’



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏఎంఓ గుంట లక్ష్మీనారాయణ

గార: మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ఎంపికైన కె.మత్స్యలేశం ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక పాఠశాలలో సర్పంచ్ బి.లలిత అధ్యక్షతన శుక్రవారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో 40 మోడల్ ఫౌండేషన్ స్కూల్స్‌ను ఎంపిక చేయగా జిల్లాలో కె.మత్స్యలేశంలోని యూపీ పాఠశాల, కొత్తూరు మండలం బమ్మిడి ప్రాథమిక పాఠశాల, శ్రీకాకుళం అర్బన్‌లోని ఏవీఎస్ఎం స్కూల్ ఎంపికయ్యాయి. ఈ ప్రగతిని ఇలాగే కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. గత నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లా, రాష్ట్ర, అంగన్‌వాడీ కో లొకేటెడ్ సభ్యులు పాఠశాలలను పరిశీలించినట్లు తెలిపారు. జిల్లాలో పలు పాఠశాలలను సందర్శించి మూడు పాఠశాలలను ఎంపిక చేశారన్నారు. ఈ పాఠశాలలో 2016–27 విద్యాసం వత్సరం నుంచి ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీలో భాగంగా విద్యార్థులు పూర్తిస్థాయి నైపుణ్యం సాధించడమే లక్ష్యంగా విద్యా బోధన, పూర్తి వసతి సౌకర్యాల కల్పన, అవసరమైన మెటీరియల్ వస్తుందన్నారు. సర్పంచ్ బి.లలిత మాట్లాడుతూ బడి ఈడు గల పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యార్థులు భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.ఎర్రన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పప్పు లక్ష్మీ, ప్రధాన ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీసీ పుస్తకాల ఆవిష్కరణ



టీసీ పుస్తకాలను ఆవిష్కరిస్తులన్న డీఈఓ జి. పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ జి. పగడాలమ్మ శుక్రవారం టీసీ పుస్తకాలు ఆవిష్కరించారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి వాటికోసం పక్క జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళంలపై ఆధారపడుతున్నారు. ఇక నుంచి ఆ ఇబ్బంది తీరిందని, ఈ విద్యాసంవత్సరం నుంచి మన టీసీ పుస్తకాలు మనం వినియోగించుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓకు, డీసీఈబీ సభ్యులు, జిల్లాలో గల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, డీఈఓలు ఆఫీసు సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ, డీసీఈబీ సెక్రటరీ పి.సీహెచ్ శ్రీనివాసరావు, ఎ.డి 1 రమణ జ్యోతి, ఎ.డి 2 దామోదర్, డీసీ సుధాకర్, సూపరింటెండెంట్ రంగాచారి, డీసీఈబీ సభ్యులు, డీఈఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో 29 బీఎస్ఎన్ఎల్ టవర్స్ ఏర్పాటు

- జీఎం జి.ఆడమ్



సదస్సులో మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జి.ఆడమ్

పార్వతీపురం: త్వరలో పార్వతీపురం మన్యం జిల్లాలో 29 బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకున్నామని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ (శ్రీకాకుళం) జి.ఆడమ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కేంద్రం పార్వతీపురంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటిసారిగా వినియోగదారుల సదస్సును నిర్వహించామన్నారు. జిల్లాలో 4జీ సేవలను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఫైబర్, ఎఫ్‌టీటీహెచ్ బ్రాండ్‌బ్యాండ్ సేవలను కూడా మొదలు పెట్టామన్నారు. బీఎస్ఎన్ఎల్ ప్లాన్‌లు అతి తక్కువ ధరకు లభిస్తున్నాయని, వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని నెట్‌వర్క్‌ల కన్నా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ బాగా పనిచేస్తోందన్నారు. ఎయిర్ ఫైబర్ లాంటి ఆధునిక సేవలను బీఎస్ఎన్ఎల్ అందిస్తోందని చెప్పారు. పార్వతీపురం నెట్‌వర్క్ పరిధిలో 2889 లాండ్‌లైన్ కనెక్షన్‌లు, 354 బ్రాడ్‌బ్యాండ్, 5,856 ఎఫ్‌టీటీహెచ్, 2,17,589 ప్రీపెయిడ్ కనెక్షన్‌లున్నాయని, వాటి సంఖ్య మరింత పెరగాలని రిటైలర్స్‌కు సూచించారు. కొత్తగా డునాట్ డిస్టర్బ్(డీఎన్‌డీ) సేవలను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం డీజీఎం దాలినాయుడు, శ్రీకాకుళం డీజీఎం మర్రినాయుడు, పార్వతీపురం ఏజీఎం తేజేశ్వరరావు, కాగ్ మెంబర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ జి.చిన్మయిదేవి



గంగరేగువలస అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌జేడీ చిన్మయి దేవి తదితరులు

కొమరాడ: ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ జి.చిన్మయి దేవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కొమరాడ ప్రాజెక్టు పరిధిలో ఉన్న గంగరేగువలస సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారులకు రక్తహీనత లేకుండా వారికి అవగాహన కల్పించడంతో పాటు కచ్చితంగా పౌష్టికాహారం అందివ్వాలని సూచించారు. అలాగే ఈ కార్యక్రమం ఈ నెల23 తేదీ వరకు ఉంటుందని చెప్పారు. పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి అవతవకలు జరిగినా శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జెడ్పీటీసీ డి.లక్ష్మి, పీడీ రాణి, కొమరాడ పీఓ సుగణకుమారి, గర్భిణులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బలిజిపేట: భార్యా, భర్తల వివాదం కారణంగా భర్త రాంబాబు(29) మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. ఎస్‌ఐ పాపారావు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగాపురం గ్రామానికి చెందిన యామల రాంబాబుకు, బర్లి గ్రామానికి చెందిన రూపకు రెండేళ్ల కిందట వివాహం జరిగింది. వీరిమధ్య శుక్రవారం గొడవ జరిగింది. భార్య తరఫున వారు వచ్చి ఇద్దరినీ సముదాయించారు. అనంతరం రూప తల్లిదండ్రులు 8 నెలల చిన్నారితో రూపను వారి ఇంటికి తీసుకెళ్లారు. దీనికి మనస్థాపం చెందిన రాంబాబు తన ఇంట్లో బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామన్నారు.

ఎన్నికల నిర్వహణలో...

ఐటీ ఆధారిత సేవలు

- సాంకేతిక సేవల విస్తృత వినియోగం
- అవగాహన కల్పనలో ఎన్నికల అధికారులు బిజీ



యాప్‌లు, పోర్టల్‌లు వినియోగంపై శిక్షణ ఇస్తున్న నోడల్ అధికారి సుధాకరరావు

విజయనగరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక సేవల వినియోగంపై కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. అక్రమాల కట్టడి, ఫిర్యాదుల స్వీకరణ, అనుమతుల జారీ వంటి పలు సేవల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) ఆధారిత సాంకేతిక సేవలను అమలులోకి తెచ్చింది. వాటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా జిల్లా అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది, ఓటరుకు అందుబాటులోకి తెచ్చే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సువిధ, సీ-విజిల్, అబ్జర్వర్ పోర్టల్, పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఫిర్యాదులపై తక్షణం స్పందించేలా అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే వ్యవస్థను తీసుకొచ్చింది. ఓటర్లు కూడా దీనిని సమర్థంగా వినియోగించుకునేలా ముందస్తు కసరత్తు జిల్లా స్థాయి నుంచి ప్రారంభించింది. దీనికోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లాలోని పలువురు సీనియర్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. వీరు ఏయే పనులు నిర్వహించాల్సి ఉంటుందనే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమితులైన అధికారులకు తొలుత శిక్షణ ఇచ్చారు. పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, నోడల్, అకౌంటింగ్ బృందం, ఐటీ, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలను వివరించారు. పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియ, ఓట్ల లెక్కింపు, వయోవృద్ధుల ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకోవడం వంటి అంశాలపై తర్ఫీదునిస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఐటీ ఆధారిత సేవలను ఈసారి మరింత విస్తృతంగా వినియోగించుకోనున్నారు.

ప్రచార అనుమతులకు 'సువిధ' యాప్

ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు తాము నిర్వహించుకునే సభలు, సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాలకు అధికార యంత్రాంగం నుంచి ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుంది. గతంలో అయితే మాన్యువల్‌గా రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వీటి కోసం అభ్యర్థులు, వారి అనుచరులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని ఉండదు. వీటికి సంబంధించిన అనుమతులను సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తారు.



ఎన్నిక నిర్వహణలో వినియోగిస్తున్న వివిధ యాప్‌లు, పోర్టల్‌లు

ప్రలోభాల కట్టడికి 'సీ-విజిల్'

ఎన్నికల్లో పోటీ అభ్యర్థుల ప్రలోభాలపై ఫిర్యాదులు తీసుకోవడానికి 'సీ-విజిల్' అనే యాప్‌ను వినియోగంలోకి తెచ్చారు. నగదు, మద్యం పంపిణీ, ఓటర్లను భయపెట్టి పోలింగ్ కేంద్రాలకు రాకుండా చేయడం ఇతర ప్రలోభాలకు గురిచేసి లబ్ధిపొందాలని చూడటం వంటి అక్రమాలను కట్టడి చేసేందుకు ఈ యాప్ అందుబాటులోకి తెచ్చారు. అక్రమాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు, లొకేషన్‌ను ఈ యాప్‌లో పొందుపరిస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు చేసే అధికారులు తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి దీనిని వినియోగించనున్నారు.

సేవలకు 'సాక్ష్యం'

ఎన్నికల నిబంధనలు, సేవలు వంటి అంశాలపై దివ్యాంగులకు అవగాహన కలిగించే యాప్ సాక్ష్యం. అదే విధంగా దివ్యాంకులకు ఇంటి వద్దే ఓటింగ్ చేసుకోవడానికి అవసరమైన సమాచార సేవలు అందిస్తుంది.

ఆదేశాల సత్వర అమలుకు...

ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి నుంచి వచ్చే ఆదేశాలు ఎన్నికల నిర్వహణ సిబ్బందికి వేగంగా చేరేలా చేసేందుకు అబ్జర్వర్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఈ పోర్టల్ పూర్తి స్థాయిలో పనిచేస్తుంది.

ఓటర్లకు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్

ఓటర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. తమ ఓటు ఉందా, లేదా... ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది, ఆ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది, బూత్ లెవెల్ అధికారి ఎవరు, ఫొటో ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) సంఖ్య వంటి ఓటరుకు అవసరమైన సమస్త సమాచారాన్ని పబ్లిక్ పోర్టల్ ద్వారా తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సాంకేతిక సేవల వినియోగంపై అవగాహన

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అందుబాటులోకి వచ్చిన సాంకేతిక సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంచాలి. జిల్లా స్థాయి నోడల్ అధికారుల నుంచి క్షేత్రస్థాయి ఓటరు వరకు తెలుసుకోవలసిన పోర్టల్స్, యాప్‌లు ఉన్నాయి. వినియోగంపై విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టాం. వీటి వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంటే ఎన్నికలు విజయవంతంగా జరుపుకోవడానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా ఎన్నికల నిర్వహణ సిబ్బంది పనిచేయాలి.

– ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్

వినండహో..!

- నేడే ఎన్నికల నగారా
- మధ్యాహ్నం వెలువడనున్న ప్రకటన
- సిద్ధమైన జిల్లా యంత్రాంగం
- వెనువెంటనే అమల్లోకి కోడ్



సాక్షి, పార్వతీపురం మన్యం:

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కీలకమైన ప్రకటన శనివారం వెలువడనుంది. మధ్యాహ్నం 3 గంటలకు 2024 అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తేదీలను ప్రకటిస్తామని కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్ని విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఎప్పుడు నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు ఎప్పుడు ఉంటుందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఎన్నికల సంఘం వెలువరించే షెడ్యూల్ ప్రకటన వెంటనే కోడ్ అమల్లోకి వస్తుంది. అప్పటి నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఎటువంటి అధికారిక కార్యక్రమాల్లోనూ పాల్గొనరు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఎన్నికల ప్రవర్తన నియమావళి పరిధిలోకి వస్తారు. నియమావళి అమల్లోకి వచ్చిన 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లోని ఫొటోలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాల్సి ఉంటుంది. ఇక మీదట ప్రజాప్రతినిధులు పూర్తిగా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోతారు. ప్రధాన పార్టీలు దాదాపు అభ్యర్థులను ఖరారు చేస్తుండడంతో ఎన్నికల ప్రచారాలతో పల్లెలు, పట్టణాలు హోరెత్తుతున్నాయి.

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ ఇప్పటికే అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఈ మేరకు జిల్లాలోని 769 ప్రాంతాల్లో 1,031 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఇందులో 26 పోలింగ్ స్టేషన్ల లొకేషన్లు, 244 పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పునకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలకు ఉద్యాన కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 23న జరిగిన తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 7,75,598 మంది ఓటర్లున్నారు. అనంతరం అందిన ఫిర్యాదులను విచారణ చేసిన పిమ్మట 1,305 ఓట్లను తొలగించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల చివరిరోజు వరకు ఓటరుగా నమోదు కావడానికి అవకాశం కల్పించారు.

సిద్ధంగా యంత్రాంగం

ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే పూర్తిస్థాయిలో రంగంలోకి దిగేలా జిల్లా యంత్రాంగం అవసరమైన కసరత్తు ముమ్మరం చేసింది. స్థానిక ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. అక్కడ మౌలిక సదుపాయాలు, భద్రత ఏర్పాట్లపై ఆరా తీశారు. బారికేడ్ల ఏర్పాటు, సీసీ కెమెరాల వంటి వాటిపై చర్చించారు. పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణు చరణ్ సాలూరులో ఏఎస్పీ సునీల్ శ్రవణ్‌తో కలిసి పోలీసులు, ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమావళి విధిగా పాటించాలని దిశానిర్దేశం చేశారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల తనిఖీ



ఉద్యాన కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: సాధారణ ఎన్నికలకు పార్వతీపురం పట్టణంలోని ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిషాంత్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో కల్పించవలసిన మౌలిక సదుపాయాలు, తీసుకోవలసిన భద్రతా ఏర్పాట్ల గురించి సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ, విద్యుత్ సరఫరా ఉండాలని స్పష్టం చేశారు. బారికేడ్ల ఏర్పాటు, రాత్రి వేళలో వెలుగు ఉండేలా విద్యుత్ సదుపాయం, సురక్షిత విద్యుత్ వైరింగ్ చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని చెబుతూ నియోజకవర్గాలవారీగా రిసెప్షన్, మీడియా సెంటర్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, రెవెన్యూ డివిజినల్ అధికారులు కె.హేమలత, ఏవీ రమణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎంవీఆర్ కృష్ణాజీ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, రోడ్లు భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారి ఎస్.వేణుగోపాలరావు, డీఈ అప్పాజీ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మోసూరులో ఫ్లాగ్‌మార్చ్

పాచిపెంట: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాచిపెంట ఎస్సై నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, ప్రత్యేక బలగాలు మండలంలోని మోసూరులో శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అందరూ బాధ్యతగా నడుచుకోవాలని ఎస్సై నారాయణ ఈ సందర్భంగా ప్రజలను కోరారు.



ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

1973 మద్యం సీసాలు సీజ్



పట్టుబడిన మద్యం సీసాలు

బలిజిపేట: బలిజిపేటలో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న 1973 (180ఎంఎల్) మద్యం సీసాలను ఎస్‌ఐ వి.పాపారావు బృందం శుక్రవారం పట్టుకుంది. బలిజిపేటలో చిన్న షాపు నడుపుతున్న టి.గోవిందమ్మకు చెందినివిగా గుర్తించింది. మద్యం సీజాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన



ధమరసింగిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని ధమరసింగిలో రూ.1.80 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ధమరసింగి నుంచి నెల్లిమర్ల మండలం చనమల్లుపేట వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మితం కానుంది. పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, సర్పంచ్ మీసాల కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం

పార్వతీపురంటౌన్: వినియోగదారుల చట్టంపై ప్రతీ ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్ అన్నారు. స్థానిక లయన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పౌరసరఫరాల శాఖ, జిల్లా వినియోగదారుల హక్కులు రక్షణ సంఘం సంయుక్తగా శుక్రవారం నిర్వహించింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారులకు ఇచ్చిన హక్కులను ప్రజలు ఉపయోగించుకోవాలని, హక్కులు తెలుసుకొని నడుచుకోవాలన్నారు. ఎక్కడైనా మోసపోతే సంబంధిత వినియోగదారుల సంఘాలకు, ప్రభుత్వాధికారులకు తెలియజేయాలని కోరారు. సంఘం అధ్యక్షుడు పి.సూర్యారావు, జనరల్ సెక్రటరీ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ మోసపోయినప్పుడు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రతి శనివారం సాయంత్రం 6 గంటలకు సంఘ సమావేశం జరుగుతుందని, ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. లీగల్ మెట్రాలజీ, ఆహార భద్రత అధికారులు, హెల్త్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ఉద్యోగులు, సంఘ సభ్యులు ఎం.ఈశ్వరరావు, ఎం.మధు, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయిపై పోలీస్ పంజా

- 2,260 చోట్ల 107 టీమ్‌ల ప్రత్యేక డ్రైవ్
- అడుగడుగునా నిశిత పరిశీలన
- వాహనాలు వదిలేసి పరారవుతున్న దొంగలు
- గంజాయి, ఖైనీ, గుట్కా రవాణాపై ప్రత్యేక నిఘా
- ఆపరేషన్ 'పరివర్తన'తో నియంత్రణ
- జిల్లామీదుగా రవాణా కట్టడికి అవిశ్రాంతంగా కృషి

ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో అక్రమంగా సాగుచేసే గంజాయి తరలింపునకు ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మార్గాలనే వ్యాపారులు ఎంచుకుంటున్నారు. దీనిని పసిగట్టిన పోలీసులు ప్రభుత్వ ఆదేశాలతో చెక్ పోస్టుల సంఖ్య, నిఘాను పెంచారు. సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నాలుగేళ్లుగా గంజాయిపై ఉక్కుపాదం మోపుతూ అక్రమ తరలింపుదారుల గుండెల్లో దడపుట్టిస్తున్నారు. గంజాయి వాసన గుప్పుమనకముందే వారిని కటకటాలపాలచేస్తున్నారు. జిల్లాలో ప్రశాంతవాతావరణం నెలకొల్పడంలో కీలకభూమిక పోషిస్తున్నారు.



వాహన తనిఖీల్లో పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)

సాక్షి, పార్వతీపురంమన్యం/విజయనగరం క్రైమ్:

జిల్లాలో మత్తు, మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు, ఎస్‌ఈబీ బృందాలు సంయుక్తంగా 'పరేషన్ పరివర్తన' పేరుతో దాడులు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో 2,260 లొకేషన్‌లలో పోలీస్, ఎస్‌ఈబీ 107 ప్రత్యేక బృందాలు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాయి. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ తనిఖీలు జరుపుతున్నాయి. గంజాయి, గుట్కా, ఖైనీ వంటి మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నాయి. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నాయి. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పి పోలీసుల సహకారంతో దాడులు విస్తృతం చేసి గంజాయి రవాణా దారుల్లో దడపుట్టిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సాలూరు, బొబ్బిలి, విజయనగరం తదితర ప్రాంతాల్లో గంజాయిని విడిచిపెట్టి నిందితులు పరారైన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి.

ప్రధాన మార్గంగా...

ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని కొండ ప్రాంతాల్లో అక్రమంగా సాగుచేసిన గంజాయి తరలింపునకు వ్యాపారులు విజయనగరం ఉమ్మడి జిల్లాను ప్రధాన రహదారి మార్గంగా ఎంచుకుంటున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో కృషిచేస్తోంది. ప్రస్తుతం ఆపరేషన్ పరివర్తన పేరుతో గంజాయి పంటలు పండించే వారికి అవగాహన కల్పించి, పంటలను నాశనం చేస్తోంది. నిషేధిత వస్తువుల అమ్మకాలు చేయవద్దని హెచ్చరికలు జారీచేస్తోంది. ఉమ్మడి జిల్లాల ఎస్పీల ఆధ్వర్యంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు విస్తృత దాడులు చేస్తున్నాయి. రహస్యంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకుంటున్నాయి. గత నాలుగేళ్లుగా నిషేధిత గంజా రవాణాపై డేగకన్ను పెట్టడంతో ప్రారంభంలో కేసుల సంఖ్య పెరిగింది. రానురానూ రవాణాదారులు భయాందోళనలకు గురై సరుకు రవాణా చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. గంజాయి తరలించే మార్గాలైన పెదబయలు మంగబంద, గుంటసీమ, దబ్రిగుడ, అరకు మీదుగా అనంతగిరి, ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస మీదుగా విశాఖ, కొటారుబిల్లి కూడలి, గంట్యాడ మీదుగా, ఒడిశాలోని కోరాపుట్ నుంచి బరంపురం, సాలూరు మీదుగా విజయనగరంలోకి, రాయగడ మీదుగా పార్వతీపురం, సీతానగరం, బొబ్బిలి, విజయనగరం మీదుగా విశాఖ వైపు వెళ్లే మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ముమ్మర తనిఖీలు జరుపుతున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో గంజాయి తరలింపు వాహనాలను పట్టుకుంటున్నారు.

గంజాయి కేసులు నమోదు ఇలా....

ఏడాది	బుక్ అయిన కేసులు	అరెస్ట్ అయిన వ్యక్తులు	సీజ్ చేసిన గంజాయి
2016	16	42	1522 కేజీల 705 గ్రా.
2017	23	63	4019 కేజీల 935 గ్రా.
2018	07	21	2024 కేజీల 60 గ్రా
2019	35	69	6231 కేజీల 301 గ్రా.
2020	35	79	6209 కేజీల 730 గ్రా.
2021	32	73	9687 కేజీల 378గ్రా.
2022	51	100	3181 కేజీల.055 గ్రా.
2023	58	105	2558 కేజీల 055 గ్రా.
2024	3 (ఫిబ్రవరి)	6	100 కేజీల.020 గ్రా.

చెక్‌పోస్టులు ఇలా..

మండలం	చెక్కుపోస్టు ప్రాంతం
పాచిపెంట	పి.కోనవలస
కొమరాడ	కూనేరు
పార్వతీపురం	ఆర్.కె.బట్టివలస
ఎస్.కోట	బొడ్డవర
సాలూరు	పద్మాపురం

అన్నిమార్గాల్లోనూ నిఘా పెంచాం

గంజాయి తరలింపు మార్గాలపై ప్రత్యేక పోలీస్ బృందాలతో నిఘాపెంచాం. స్వీపర్ సెల్స్‌పై ఆరా తీస్తున్నాం. అక్రమార్కుల వలలో గిరిజన యువత చిక్కుకోకుండా అవగాహన కల్పిస్తున్నాం. పాచిపెంట, కొమరాడ, పార్వతీపురం, సాలూరు మండలాల్లో చెక్కుపోస్టులు ఏర్పాటు చేసి జిల్లా మీదుగా గంజాయి తరలింపును పూర్తిస్థాయిలో అడ్డుకుంటున్నాం.

– విక్రాంత్‌పాటిల్, ఎస్పీ, పార్వతీపురం మన్యం